

ధనుర్మాసం సందర్భంగా రాజన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు (ఫైల్)

# ధనుర్మాసానికి వేళాయె

- నేటి నుంచి వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు
- 23న రాజన్న ఆలయంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- భక్తులకు స్వామివారి ఉత్తరద్వార దర్శనం

వేములవాడ టౌన్, డిసెంబర్ 16: ఒక చేతిలో చిరతలు, మరో చేతిలో తంబుర, శిరస్సుపై కుంభం, మెడలో పూలహారం ధరించి, హరిలో రంగ హరి అంటూ.. నిరంతరం హరినామ స్మరణతో హరిదాసులు సందడి చేసే పవిత్ర ధనుర్మాసం ఆదివారం నుంచి ప్రారంభంకానున్నది. హిందువులు ఈ మాసాన్ని సంక్రాంతి నెల పట్టడం అని కూడా అంటారు. వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను ఆనవాయితీగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయగా, ఆలయం వేడుకలకు ముస్తాబైంది. డిసెంబర్ నెల రెండో పక్షం ఆరంభంలో సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించినప్పటి నుంచి జనవరి మొదటి పక్షం చివరిలో మకర రాశిలోకి ప్రవేశించే వరకు ఉన్న నెల రోజులను ధనుర్మాసం అంటారు. తులసీదాత్రీవన పరివేష్టితుడైన శ్రీహరి వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తారు. ధనుర్మాసంలో గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథుడిని సేవి స్తూ తన చెలికత్తెలతో కలిసి చేసిన శ్లోకాలే రోజుకోపాశురంగా నిలిచిపోయాయి. గోదాదేవి స్వామిని కీర్తించిన పాశురాల్లో ఆత్మ సమర్పణం, ఆత్మ నివేదనమే కనిపిస్తుంది. అనన్యమైన చిత్తవృత్తి, అచంచలమైన భక్తి విశ్వాసాలతో గోదాదేవి అమ్మవారు స్వామివారిని కీర్తించారు. ఈ నెల రోజులపాటు ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేసి, ఆవుపేడతో గొబ్బెమ్మలు పెట్టి, వాటిని రంగురంగుల పూలతో అలంకరిస్తారు.

### అంగరంగ వైభవంగా వేడుకలు

రాజన్న అనుబంధ దేవాలయమైన వేణుగోపాల స్వామివారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభంకానున్నాయి. స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, పూజారి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. నేటి నుంచి రాజన్న ఆలయంలో ఉదయం 6 గంటలకు ధనుర్మాస ఉత్సవం ప్రారంభంకానున్నది. ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తాం. వేణుగోపాలస్వామి ఆలయంలో జనవరి 9న హారతి పాశురం, 12న కూడార్రై, 14 న గోదాశ్రీరంగనాయక కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తాం.



- కృష్ణప్రసాద్, రాజన్న ఆలయ ఈవో

సండే స్పెషల్ Sunday Special

# ఊరంతా నాగ ప్రతిమలే

**చారిత్రక గ్రామం నాగులపేట**

- కొన్నేండ్లుగా వందల సంఖ్యలో బయటపడుతున్న విగ్రహాలు
- ఒకే చోట 285 ప్రతిమలు.. సమీపంలోనే మరికొన్ని
- ఊరిలో శతాబ్దాలుగా నాగ అక్షరంతోనే ఎక్కువ పేర్లు
- గ్రామానికి కిలోమీటరు దూరంలోనే జైన ఆలయం.. పార్శ్వనాథుడు, బాహుబలి విగ్రహాలు
- హిందూ, బౌద్ధ, జైన ఆచారాల్లోనూ నాగ ప్రతిమలకు ప్రత్యేక స్థానం
- పరిశోధనలపై దృష్టిపెట్టాలని కోరుతున్న చరిత్రకారులు





నాగులపేటలో బయటపడిన నాగ ప్రతిమలు






పార్శ్వనాథుడి విగ్రహం



బాహుబలి విగ్రహం



ప్రభా మండలంలో

జగిత్యాల, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ): కోరుట్ల మండలంలోని ఒక చిన్న గ్రామం నాగులపేట. ఈ గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలియదు కానీ, ఆ పేరుకు సార్థకత చేకూర్చుతూ, గ్రామ శివారులో నాగ ప్రతిమలు పెద్ద సంఖ్యలో బయటపడుతున్నాయి. కొన్నేండ్ల క్రితం కొన్ని నాగ ప్రతిమలు ఉండేవి. ఆ నాగ ప్రతిమలు ఉన్న చోట చెట్ల కిందనే పూజలు నిర్వహించే వారు. అయితే కాలక్రమంలో అదే స్థానంలో భూమి నుంచి వందల సంఖ్యలో ప్రతిమలు బయటపడుతూ వస్తున్నాయంటున్నారు గ్రామస్తులు. వర్షం కురిసిందంటే చాలు భూమిలో ఉన్న ప్రతిమలు వెలుగు చూస్తున్నాయంటున్నారు ఆలయ పూజారి కిషన్ శర్మ. నాగ దేవత ఆకారంలో ఉన్న విగ్రహాలతోపాటు ఐదు పడగల నాగుపాము విగ్రహాలు వెలుగు చూస్తున్నాయి. చెట్ల కింద ఒకేచోట 285 ప్రతిమ విగ్రహాలు బయటపడ్డాయి. ఇక ఈ స్థలానికి దగ్గరలోనే ఉన్న మామిడితోటలోనూ పదుల సంఖ్యలో నాగప్రతిమలు బయటికి వచ్చాయి. అలాగే కొద్దిదూరంలో ఉన్న హన్మాన్ ఆలయం సమీపంలో సైతం కొన్ని నాగ ప్రతిమలు బయటపడ్డాయి. నాగులపేటలో వందల సంఖ్యలో నాగ ప్రతిమలు బయటపడుతుండడం చరిత్రకారులను ఆలోచనలో పడేస్తున్నది.

### నాగ' అక్షరంతోనే.. అధిక పేర్లు

గ్రామం పేరు నాగులపేట కాగా, అక్కడ చాలా మంది పేరు నాగ అక్షరంతోనే మొదలుకావడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. నాగ ప్రతిమలకు ఇక్కడ పూజ దశాబ్దాలుగా సాగుతూ వస్తున్నదని, నాగదేవతల దయతో పుత్ర సంతానం కలుగడం, సంప్రదాయంగా తరతరాలుగా నాగదేవత ఆరాధకులు కావడంతో గ్రామంలో నాగ అక్షరంతో పేర్లు పెట్టుకోవడం ఇక్కడ రివాజుగా మారిందని గ్రామస్తులు, పూజారి చెబుతున్నారు.

### గ్రామం చారిత్రక కేంద్రమే

నాగులపేటలో వందల సంఖ్యలో బయటపడుతున్న నాగ దేవతల ప్రతిమలను చూస్తుంటే, ఇది దాదాపు వెయ్యి, పన్నెండు వందల ఏండ్ల క్రితం చారిత్రక కేంద్రమై ఉంటుందని చరిత్రకారులు భావిస్తున్నారు. నాగ ప్రతిమలు వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలానికి లేదా అంతకంటే ముందు కాలానికి చెందినవి అయి ఉండే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అలాగే ఒకప్పుడు భిన్నకాలాల్లో వృద్ధి చెందిన ప్రధాన నగరమై ఉండే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. హిందూ, జైన, బౌద్ధ మతాలు మూడింటిలోనూ నాగ పత్రిమలకు ప్రాధాన్యత ఉందని, అన్ని మతాచార్యులు నాగిని విగ్రహాలను చెక్కించారని, ప్రాధాన్యతను ఇచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో నాగులపేట పూర్వకాలం నుంచి మూడు మతాల వారి పోషణలోనూ విలసిల్లి ఉండవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విగ్రహాలు బయటపడుతున్న స్థలానికి కిలోమీటర్ దూరంలోనే కోరుట్ల పట్టణ పరిధిలో జైన మతానికి సంబంధించిన కళ్యాణి చాళుక్యుల కాలం నాటి రట్ట మార్తాండ దేవాలయం ఉంది. ఈ దేవాలయానికి అనుబంధంగా నిర్మించిన కోనేరులో త్రైలోక్యమల్లదేవుడి కాలానికి చెందిన శాసనం ఉంది. ఈ శాసనంలో జైనమతానికి చెందిన ఆలయ నిర్మాణ ప్రస్తావనతో పాటు, జైనమతాచార్యులు (జైన ఫిలాసఫర్స్) అవలంభించే క్రాణూర్గణ గచ్ఛ, తింత్రిణిగచ్ఛల ప్రస్తావనతో పాటు, కొరవట్టు (విద్యావేత్తలు, జ్ఞానశీలురు) వారు చేసే గోష్ఠి (చర్చ) అంశం పేర్కొనబడింది. అలాగే ఆలయంలో పార్శ్వనాథుడి నిలువెత్తు విగ్రహం, బాహుబలి విగ్రహాలు, జైన ప్రభా మండలాలు ఉన్నాయి. వీటన్నింటిని పరిశీలించిన చరిత్రకారులు కోరుట్ల రట్ట మార్తాండ ఆలయ ప్రాంతంతో పాటు, నాగులపేట గ్రామం 1500 ఏండ్ల క్రితమే పెద్ద పట్టణమై ఉండవచ్చున్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### తవ్వకాలు జరపాలి

నాగులపేటలో వందల సంఖ్యలో విగ్రహాలు బయటపడుతున్న స్థలంలో తవ్వకాలు నిర్వహించాల్సిన అవసరమున్నది. గ్రామంలో ఇప్పటికే 300కు పైగా నాగ ప్రతిమలు బయటపడ్డాయి. ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. ఆ ప్రతిమలన్నీ చారిత్రాత్మకమైనవే. అన్నింటి చరిత్ర దాదాపు వెయ్యి, పన్నెండు వందల ఏండ్లు ఉంటుంది. ఇన్ని పత్రిమలు ఒకేచోట బయటపడడం అనేది ఇంత వరకు ఎక్కడా జరుగలేదు. ఈ ప్రాంతానికి సమీపంలోనే జైన మతానికి సంబంధించిన ఆలయం, శాసనం, శిల్పకళ అన్ని ఉన్నాయి. ఈ స్థలాలను పరిశీలిస్తే ఇదో పెద్ద చారిత్రక కేంద్రం అని అనిపిస్తోంది. రాష్ట్రకూటులు, వేములవాడ, కళ్యాణి చాళుక్యులు, కాకతీయుల కాలాల్లో ఇది జన సమర్థం ఎక్కువ ఉన్న కేంద్రంతో పాటు, వాణిజ్య, వ్యాపార కూడలి లేదా పెద్ద నగరం అయి ఉండవచ్చని అనిపిస్తుంది. ప్రభుత్వం నాగులపేటపై దృష్టి పెట్టి, పురావస్తు శాఖ వారితో ఇక్కడ తవ్వకాలు జరిపిస్తే మరింత కీలక చరిత్ర వెలుగుచూసే అవకాశాలున్నాయి. ఆ దిశగా ప్రయత్నం చేయాలి.



- డాక్టర్ పోతరవేణి తిరుపతి, చరిత్రకారుడు

# ఆదర్శం.. విశ్రాంత ఉద్యోగులు

- మలిదశలోనూ సామాజిక సేవలు
- సహచరులకు ఉచితంగా వైద్య చికిత్సలు
- తోటి వారికి అండగా నిలుస్తున్న వైనం
- నేడు పెన్షనర్స్‌డే..



స్వచ్ఛభారత్‌లో భాగంగా పరిసరాలు శుభ్రం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు (ఫైల్)

"మలిదశలోనూ నలుగురికీ సాయం చేస్తూ.. సామాజిక సేవలో ముందుండి ఆదర్శంగా నిలుస్తున్నారు వేములవాడలోని విశ్రాంత ఉద్యోగులు. సహచరులకు అవసరమైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తూ మేమున్నామంటూ భరోసానిస్తున్నారు. అలుపెరగని సేవలందిస్తూ.. తోటివారికి అండగా నిలుస్తుండగా, వారిని పలువురు అభినందిస్తున్నారు."



కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్)



ఉచిత వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు (ఫైల్)

వేములవాడ, డిసెంబర్16: పదవీ విరమణ అంటే బాధ్యతల్లో నుంచి తప్పుకొని ప్రశాంతంగా జీవించడమే అనేది అందరికీ తెలిసిన సత్యం. కానీ.. వేములవాడ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగులు మలిదశలోనూ నలుగురికి సాయం చేస్తున్నారు. సహచరులకు అవసరమైన సేవలను అందిస్తూ, వారికి అన్నివిధాలా అండగా ఉంటున్నారు.

### 17 సంవత్సరాలుగా..

వేములవాడ సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని వేములవాడ, చందుర్తి, రుద్రంగి, బోయినపల్లి మండలాలకు చెందిన విశ్రాంత ఉద్యోగుల సంఘం 2006లో ప్రారంభమైంది. ఎన్ రాజయ్యయాదవ్ అనే విశ్రాంత ఉద్యోగి నివాసంలోనే ఈ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 17 సంవత్సరాలుగా సహచరులకు అవసరమైన సేవలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 500మందితో ప్రస్తుతం ఈ విశ్రాంత ఉద్యోగుల సంఘం నడుస్తున్నది.

### సామాజిక సేవలోనే ముందడుగు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన స్వచ్ఛభారత్‌లో కూడా విశ్రాంత ఉద్యోగులు తమ వంతు కృషి చేశారు. ప్రజలను చైతన్యవంతం చేయడమే కాకుండా, వారు కూడా స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములయ్యా రు. అలాగే విశ్రాంత ఉద్యోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటికే 40సార్లు వేములవాడ పట్టణంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఉప్పుగడ్డ ఆంజనేయస్వామి ఆలయ టీఎన్‌జీవో భవనంలో ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నారు. దాదాపు 300మందికి కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సలు చేయించారు.




వేములవాడలో విశ్రాంత తహసీల్దార్ రాజేశంను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు (ఫైల్)

### సీనియర్ పెన్షనర్‌లకు సన్మానం

పదవీ విరమణ పొందిన తోటి విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్నారు. ఏటా డిసెంబర్ 17న పెన్షనర్ డే సందర్భంగా సంఘంలోని సీనియర్ పెన్షనర్‌ను ఘనంగా సత్కరిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం నిర్వహించే పెన్షనర్ డే సందర్భంగా విశ్రాంత ఉద్యోగులను ఆలయ టీఎన్‌జీవో సంఘంలోసన్మానించనున్నారు.

### తోటివారికి సాయం చేస్తున్నం

తమ సంఘంలోని సభ్యులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తున్నాం. పదవీ విరమణ పొందిన సమయంలో వచ్చే పెన్షన్, ఇతరత్రా కార్యాలయాల పనులను చక్కబెడతాం. ఆరోగ్యం బాగా లేనివారికి కూడా అవసరమైన వైద్య పరీక్షలను ఉచిత వైద్య శిబిరాల ద్వారా అందిస్తున్నాం.



- చల్ల సత్తయ్య యాదవ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి (వేములవాడ)

### మాకు.. మేమే సన్మానించుకుంటం..



ప్రతి సంవత్సరం పెన్షనర్ డే సందర్భంగా మా సంఘంలోని సీనియర్ పెన్షనర్లను సన్మానించుకుంటం.. మాకు మేమే.. గౌరవించుకొని అందరం కలిసికట్టుగా ఉంటం.. పదవీ విరమణ పొందిన 2016 నుంచి ప్రతి కార్యక్రమంలో నా వంతుగా సేవలు అందిస్తున్న..

- ఇప్పపూల దేవయ్య, విశ్రాంత ఉద్యోగి (వేములవాడ)

### సామాజిక సేవలో భాగస్వాములవుతున్నం..

పదవీ విరమణ పొందినప్పటికీ సామాజిక సేవలో ప్రతి ఒక్కరం పాల్గొంటున్నం. స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల్లో కూడా తమవంతు బాధ్యతను పంచుకుంటున్నం. ఇతర సామాజిక సేవలోనూ క్రమం తప్పకుండా హాజరవుతున్నం. రానున్న రోజుల సేవలను మరింత విస్తృతం చేస్తం.



- సిద్ధంశెట్టి రాజేశం, విశ్రాంత ఉద్యోగుల సంఘం కోశాధికారి (వేములవాడ)

# చలికాలం.. జీవాలు పదిలం

- మేకలు, గొర్రెలకు వ్యాధులు సోకే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్16: చలి తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నది. దీంతో జీవాల్లో పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉన్నది. పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులతో జీవాలకు తుమ్ములు, కండ్లు, ముక్కు నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కని పిస్తుంటాయి. క్రిములతో సోకే అంటువ్యాధులతో పాటు ఆరు బయట తినడంతో శ్వాస కోశంలోకి వచ్చే కణాలతో వ్యాధులు వస్తాయి.



### పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే..

వ్యాధుల నివారణకు గానూ జీవాలకు గాలి, వెలుతురు సరిగ్గా వచ్చే విధంగా చూడాలి. వాతా వరణం అనుకూలంగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధులు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి. చలికాలంలో పీపీఆర్ వ్యాధి సోకిన జీవాలు పారిన పెండ, ముక్కు, కండ్ల నుంచి వచ్చే ద్రవాలతో వైరస్ మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. జీవాలకు ముక్కు నుంచి నీళ్లు కారడం ప్రారంభమై, ఒకటి, రెండు రోజుల్లో చీమిడి రూపంలోకి మారుతుంది. కండ్లు ఎర్రబడి నీరు కారుతుంది. నోటి లోపలి పొర దెబ్బతిని, చిగుళ్లు పొర సెక్రోసిస్ చెందవచ్చు. ఊపిరితిత్తులకు వ్యాధి సోకడం వల్ల దగ్గు వస్తుంది. దీంతో జీవాలు నీళ్ల పారడంతో మూడు నాలుగు రోజుల్లోనే చనిపోయే అవకాశం ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

### జీవాలపై శ్రద్ధ వహించాలి

జీవాలు చలి బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాల విషయంలో పెంపకందారులు ఎక్కువగా శ్రద్ధ వహించాలి. పీపీఆర్(పుర్రు) వైరస్ జీవాలకు సోకే అవకాశం ఉంటుంది. దీని నివారణకు నిర్దిష్టమైన చికిత్స లేదు. రోగాలు రాకుండా దీర్ఘకాలంపాటు పనిచేసే అక్రిటెట్రాసైక్లిన్ వాడొచ్చు. నీరసించిన జీవాలకు గ్లూకోజ్ ఎక్కించొచ్చు. పెంపకందారులు జీవాల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి. గాలి, వెలుతురు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.



- రవీందర్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి